క్లుప్తంగా

హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో తీసుకోవాలి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనాజీపురం ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి నుంచి 10వతరగతి వరకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈనెల 7న జరిగే ప్రవేశపరీక్షకు హాల్‌టికెట్లు ఆన్‌లైన్‌లో తీసుకోవాలని ప్రిన్సిపల్ ప్రమీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనుల ప్రారంభంలో పాల్గొన్న నాయకులు, గ్రామస్తులు

నాగారం : మండల పరిధిలోని నాగారంబంగ్లా గ్రామపంచాయతీ పరిధిలో గల విజయనగర్ కాలనీలో ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో మంజూరైన సీసీరోడ్డు పనులకు బుధవారం కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో గ్రామంలో సీసీరోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బయ్యం లింగయ్య, కొనిరెడ్డి మోహన్‌రెడ్డి, బయ్యం వెంకన్న, కొనిరెడ్డి లింగారెడ్డి, అంజయ్య, గుంటకండ్ల ముకుందారెడ్డి, పాశం బన్ను, తొడుసు వీరయ్య, గేడ్డేటి సురేష్, హరీష్, శ్రీకాంత్, సతీష్, చారి, సంజీవరెడ్డి, ఉప్పలయ్య, వీరయ్య పాల్గొన్నారు.

రికార్డులు స్వాధీనం

సూర్యాపేట : పట్టణంలోని మధుబాబు ఆస్పత్రిని గత నెల ఫిబ్రవరి 22న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో తనిఖీ చేసిన అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి, పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. వాటిని పరిశీలించిన అధికారులు, ఆస్పత్రి ఎంటీపీ సర్టిఫికెట్, ల్యాబ్ అనుమతులు రద్దు చేసినట్లు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం బుధవారం తెలిపారు.

గొడుగుల పంపిణీ



నిరుపేదలకు గొడుగులు అందజేస్తున్న ఎంపీటీసీ మార్త అనిత, లయన్స్ క్లబ్ సభ్యులు

మద్దిరాల : మండల కేంద్రంలో రోడ్లకు ఇరువైపులా చిరువ్యాపారం చేసుకునే నిరుపేదలకు నూతనకల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వేసవి దృష్ట్యా గొడుగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్త అనితాకృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. గొడుగులు అందజేయడం లయన్స్‌క్లబ్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో నూతనకల్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా, కోశాధికారి బంధు కృష్ణయ్య, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ సాబాధి వెంకట్‌రెడ్డి, నాగం సుధీర్‌రెడ్డి, యాకూబ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

జ్యువెలరీ షాపులో చోరీ

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలోని శాంభవి జ్యువెలరీ షాపులో ఇద్దరు గుర్తుతెలియని మహిళలు రూ.1.40లక్షల విలువగల బంగారు దుద్దులు మంగళవారం సాయంత్రం చోరీ చేసినట్లు ఎస్‌ఐ కె.సత్యనారాయణ బుధవారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వైభవోపేతం.. నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని బుధవారం అర్చకులు వేదమంత్రాలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్సం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పదిన్నర లోపే కూలీలను ఇంటికి పంపాలి

మునగాల : ఎండలు అధికంగా ఉన్నందున ఉపాధి హామీ కూలీలను పదిన్నర గంటలలోపే ఇంటికి పంపించాలని సామాజిక కార్యకర్త గంధం సైదులు, రైతు సంఘం నాయకులు దేవరం శ్రీనివాసరెడ్డి అధికారులను కోరారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పని ప్రదేశానికి స్థానిక ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులను వారు తీసుకువెళ్లి పరిస్థితిని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనిచేస్తున్న చోట సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని, కొన్ని గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లు మధ్యాహ్నం 12గంటల వరకు పనులు చేయిస్తున్నారని ఆరోపించారు. ఎండ తీవ్రతతో వృద్ధులు, మహిళలు, వికలాంగులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఊపందుకున్న ‘ఉపాధి’ పనులు

- చెరువులు, కుంటల్లో చేపడుతున్న పూడికతీత పనులు
- పనిప్రదేశాల్లో కల్పించని కనీస వసతులు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు



పస్తాలలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు



ఫణిగిరి చెరువులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

నాగారం : ఉపాధిహామీ పథకం ద్వారా మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు ఊపందుకున్నాయి. ప్రతి ఏడాది క్రమం తప్పకుండా సుమారు 3వేల మందికిపైగా కూలీలు పనులకు వెళ్తుంటారు. ప్రస్తుతం రోజు 1,000 నుంచి 1300 మందికిపైగా కూలీలు ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఏప్రిల్ చివర్లో, మే నెల నుంచి ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. వేసవి నేపథ్యంలో ఉపాధి పనులను ఉదయం 7నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరిగి సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు పనులు చేసేందుకు వెసులుబాటు కల్పించారు. మండలంలో 14 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 9,367 జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈ జాబ్‌కార్డుల పరిధిలో 22,558 మంది కూలీలుగా నమోదై ఉన్నారు. వాటిలో 3వేలకుపైగా యాక్టివ్‌కార్డుల ఉన్నాయి. అలాగే మండలంలో ప్రస్తుతం ఉపాధిహామీ పథకంలో భాగంగా కాలువలు, చెరువులు, కుంటల్లో పూడికతీత, ఫీడర్ చానల్స్, నర్సరీలు, మట్టి రహదారుల నిర్మాణం తదితర పనులు జరుగుతున్నట్లు ఈజీఎస్ అధికారులు పేర్కొన్నారు.

పనిప్రదేశంలో కానరాని మౌలిక వసతులు..

రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతుండటంతో ఉపాధిహామీ పనులు చేసేచోట కనీస వసతులు లేకపోవడంతో ఉపాధికూలీలు ఎండలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉపాధి పనులు చేసే చోట్లలో నీడ కోసం గతంలో సమకూర్చిన టెంట్లు పనికిరాకుండా పోయాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో కూలీలకు మంచినీరు, షేడ్ నెట్స్‌ను అందిస్తున్నారు. ఇవి కూడా అరకొరగా ఉండటంతో ఎండలకు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పనిప్రదేశాల వద్ద మెడికల్ కిట్లు అందుబాటులో ఉండాలనే నిబంధనలు ఉన్నా ఎక్కడా కన్పించడం లేదు. ప్రభుత్వం ఉపాధి పనిస్థలాల్లో మౌలిక వసతులు పూర్తిగా విస్మరించడంతో కూలీలు ఇబ్బందుల మధ్య పనులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

జాబ్‌కార్డు ఉన్నవారందరికీ పనికల్పిస్తున్నాం



జాబ్‌కార్డు కలిగి ఉండి ఉపాధిహామీ పనికి దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి పనులు కల్పిస్తున్నాం. ఉపాధి పనులు జరిగే చోట వసతుల కల్పనకు చర్యలు చేపట్టాము. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రనిప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం షెడ్‌నెట్స్, మంచినీటి సౌకర్యం కల్పిస్తున్నాము. మండలంలో ప్రస్తుతం రోజుకు సుమారు 1,300మందికి పైగా కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు.

– పి.రవి, ఏపీఓ, నాగారం

సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ రవీందర్

పెన్‌పహాడ్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ పి.రవీందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో ఎస్పీ రాహుల్‌హెగ్డే ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలు, విద్యార్థుల రక్షణ, చట్టాలు, విద్యా విధానాలు, సమస్యలను అధిగమించడం, సోషల్ మీడియా, ఇంటర్నెట్ సద్వినియోగం లాంటి అంశాలపై విద్యార్థులు ఒత్తిడి అధిగమించి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. లక్ష్యం కోసం కృషి చేయాలని పోలీసు కళాబృందం సభ్యులు పాటల ద్వారా అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్య వచ్చినా శాంతిభద్రతలకు ఆటంకం కలిగించకుండా పరిష్కారం చేసుకోవాలన్నారు. చట్టాలను చేతుల్లోకి తీసుకోకుండా వాటిని గౌరవించి పోలీసులకు తెలియపర్చాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ మురళీధర్‌రెడ్డి, పోలీసు కళాబృందం ఇన్‌చార్జ్ మల్లయ్య, గోపి, నాగార్జున, క్రిష్ణచారి, గురులింగం తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో నగదు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

మద్దిరాల : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దు గ్రామమైన మండల పరిధిలోని కుంటపల్లిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన మట్టిపల్లి నాగయ్య వరంగల్ నుంచి కొత్తగూడెం బొలెరో వాహనంలో వస్తుండగా వాహనంలో తనిఖీ చేయగా రూ.1,50,000ల నగదును గుర్తించి స్వాధీనం చేసికున్నట్లు ఎస్‌ఐ మధునాయుడు తెలిపారు. తనిఖీల్లో ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణపై సమీక్ష



సూర్యాపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి



నూతనకల్ : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి



మద్దిరాల : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి

సూర్యాపేట : వేసవిలో గ్రామాల్లో ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సూర్యాపేటలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎంపీటీసీలు సమావేశంలో వివరించారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. సమావేశంలో జెడ్పీటీసీ జీడి భిక్షం, ఎంపీడీఓ బాలకృష్ణ, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్‌నాయుడు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తాగునీటి సమస్యలు గ్రామాల్లో తలెత్తకుండా అందుకు తగ్గట్టుగా తాగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా వైద్యసిబ్బంది అవగాహన కల్పించి వారికి అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ రాజేష్, ఏఓ వికాస్‌పాటిల్, పీఆర్ ఏఈ లావణ్య, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

నూతనకల్ : వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి అధికారులను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రక్షిత మంచినీటిని ప్రతి ఒక్కరికీ అందించాలని, నీటి కొరత ఉన్న గ్రామాలను గుర్తించి అద్దె బోర్లను లీజుకు తీసుకోవాలని ఆమె సూచించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రతి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ సునీత, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోసపహాడ్‌లో పోలీసుల కవాతు



కవాతు చేస్తున్న పోలీసులు, పారామిలటరీ బలగాలు

పెన్‌పహాడ్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని దోసపహాడ్‌లో పోలీసు, పారామిలటరీ దళాలతో కవాతు నిర్వహించి ఓటర్లను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువ ప్రతిఒక్కరూ తెలుసుకొని చైతన్యంతో దానిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పెరిక రవీందర్, పారామిలటరీ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పర్సాయపల్లిలో పశు వైద్యశిబిరం



పశు వైద్యశిబిరంలో పాల్గొన్న సిబ్బంది, రైతులు

అర్వపల్లి : మండలంలోని పర్సాయపల్లి గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 200పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు ఈ టీకాలను వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్, సిబ్బంది యాకయ్య, యాదగిరి, గోపాలమిత్రలు ఆల్డాస్ లింగయ్య, కుంభం సురేందర్, సూరారపు అర్జున్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరికి క్వింటాకు రూ.3200 ధర చెల్లించాలి



కలెక్టరేట్‌లో వినతిపత్రం అందిస్తున్న సభ్యులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : వరి ధాన్యానికి క్వింటాకు రూ.3,200 మద్దతు ధర చెల్లించాలని సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్, రిటైర్డ్ తహసీల్దార్, న్యాయవాది ఎల్.భద్రయ్య ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని కలెక్టరేట్‌లో ఏఓ సదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. తెలంగాణలో వ్యవసాయం లాభసాటిగా మారాలంటే ఎలా? అనే అంశంపై సూర్యాపేట అధ్యయన వేదిక ఆధ్వర్యంలో విస్తృతంగా చర్చించి ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో వేదిక కో–కన్వీనర్ రేపాక లింగయ్య, దంతాల రాంబాబు, అబ్దుల్ కరీం, చామకూరి నర్సయ్య, ఆవుల నాగరాజు, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



పెన్‌పహాడ్ : అనంతారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్



అర్వపల్లి : తిమ్మాపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ

చివ్వెంల(సూర్యాపేట) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మండల తహసీల్దార్ క్రిష్ణయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని రోళ్లబండతండాలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ఆరబెట్టిన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఐకేపీ కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు, సీసీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలి

పెన్‌పహాడ్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సమర్థంగా నిర్వహించాలని ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. మండలంలోని అనంతారం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నీరు, నీడ తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. కాంటాలు త్వరితగతిన వేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మండడి మహేందర్‌రెడ్డి, ఏఓ బి.కృష్ణసందీప్, సీఈఓ ఆలకుంట్ల సైదులు, ఏపీఎం అజయ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఏఓ ఆర్.శశిధర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పర్సాయపల్లి, తిమ్మాపురం, కాసర్లపహాడ్, సూర్యానాయక్‌తండా, ఉయ్యాలవాడ, వేల్పుచర్ల గ్రామాల్లో బుధవారం సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులకు తాగునీరు, నీడ తదితర మౌలిక వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఆర్‌ఐ పాటి వెంకట్‌రెడ్డి, ఏఈఓలు శోభారాణి, సత్యం, సీసీలు పద్మ, నగేష్, మాజీ జెడ్పీటీసీ కె.అవిలయ్య, భరత్‌రెడ్డి, భద్రారెడ్డి, సంఘబంధం అధ్యక్షులు కె.అండాలు, నూర్జహాన్, లక్ష్మి, కర్కాని శైలజ, బొడ్డు స్వప్న, వీఓఏలు ఎస్.లక్ష్మి, సునీత, శంకర్, విజయ, చంద్రకళ, అనిత, శంకర్, సైదులు నిర్వాహకులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యంతో మద్దతు ధర పొందాలి

నాగారం : ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరను పొందాలని ఏపీఓ శోభారాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఫణిగిరి, మామిడిపల్లి, పసునూర్, వర్థమానుకోట, పేరబోయినగూడెం గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బీ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 చొప్పున మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. రైతులు 17శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకరావాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీసీ రామయ్య, మహిళా సంఘాల సభ్యులు కళమ్మ, మమత, స్వరూప, మణెమ్మ, పుష్పమ్మ, రైతులు పాల్గొన్నారు.

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీపీఎం ఆంజనేయులు కోరారు. బుధవారం మండల పరిధిలోని యడవెల్లి, టీక్యాతండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందా లని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం కర్ణాకర్, సీసీ ముత్తయ్య, గీత, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.



చివ్వెంల : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్



నాగారం : ఫణిగిరిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం శోభారాణి



నూతనకల్ : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం ఆంజనేయులు

మంత్రి వెంకట్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేత



మంత్రి వెంకట్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న గ్రామస్తులు

అర్వపల్లి : మండలంలోని అడివెంల గ్రామ ఎస్సీ కాలనీలో ఈనెల 5నుంచి 7వరకు నిర్వహించే ముత్యాలమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ గ్రామస్తులు బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేశారు. ఆహ్వానించిన వారిలో టెన్నిస్ జాతీయ క్రీడాకారిణి రేఖ, చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ బోయలపల్లి రేఖ, ఆలయ కమిటీ సభ్యులు పేరెల్లి ఉపేందర్, లింగయ్య, సైదులు, నాగరాజు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పల్లెప్రకృతి వనం దగ్ధం

మద్దిరాల : ప్రమాదవశాత్తు పల్లెప్రకృతి వనం దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ముకుందాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పల్లెప్రకృతి వనంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పువేయడంతో కాలుతున్నట్లు గ్రామస్తులు గమనించి వెళ్లి చూసేసరికి పూర్తిగా కాలి దగ్ధమైనట్లు తెలిపారు. ఈ సమాచారాన్ని స్థానిక అధికారులకు తెలియజేయడంతో ఎస్‌ఐ మధునాయుడు, పంచాయతీ కార్యదర్శి ఉమ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకోని మాట్లాడారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ నాయకులు

కోదాడ : గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన జర్నలిస్టులందరికీ తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కోదాడకు చెందిన ఐజేయూ జర్నలిస్టులు హుజూర్‌నగర్‌లోని మంత్రి నివాసంలో కలిసి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కోదాడలో జర్నలిస్టులకు తానే ఇళ్ల స్థలాలు ఇప్పించానని, మిగిలిన వారికి కూడా తానే ఇళ్ల స్థలాలను ఇప్పిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జిల్లా అధ్యక్షుడు కోలా నాగేశ్వరరావు, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గింజల అప్పిరెడ్డి, జర్నలిస్టులపై దాడుల నిరోధక కమిటీ జిల్లా అధ్యక్షుడు బాదె రాము, జర్నలిస్టులు జయవరపు నరేందర్, అలుగూరి హరినాథ్, దాచేపల్లి సతీష్, శంషుద్దీన్, లంకెల దశరథరెడ్డి, జూలూరి వీరభద్రం, మేకపోతుల వెంకటేశ్వర్లు, కోట రాంబాబు, ఆవుల మల్లికార్జున్, లావుడి రమేష్, చారుగండ్ల అజయ్, పగడాల వాసు, చలిగంటి దామోదర్, పల్లపు శ్రీనివాస్, గంధం రాము, వెలిశాల శ్రీనివాస్, నలిగంటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతరలో వివిధ వస్తువుల విక్రయానికి వేలం

చివ్వెంల(సూర్యాపేట) : మండలంలోని పులితండాలో వెలిసిన గిరిజనుల ఆరాధ్యదైవం శ్రీ చాంపూలాల్ స్వామి జాతర ఈనెల 25, 26తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జాతరలో వివిధ రకాల వస్తువుల విక్రయాలకు వేలం పాట నిర్వహించారు. సూర్యాపేటకు చెందిన యామా నాగరాజు రూ.64వేలకు మిఠాయి విక్రయానికి, అదే విధంగా వరిపేలాల విక్రయానికి రూ.30వేలకు పాటలో దక్కించుకున్నారు. అదే విధంగా తలనీలాల సేకరణకు వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన జంపాల మల్లయ్య రూ.26 వేలకు పాటలో దక్కించుకున్నారు. కొబ్బరికాయలను సూర్యాపేటకు చెందిన యాదా రంగయ్య రూ.23వేలకు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి రాజశేఖర్‌రావు, ఎంపీఓ గోపి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



వేలం పాటలో పాల్గొన్న అధికారులు

రైతులను ఆదుకోవాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో గతేడాది ఏప్రిల్‌లో అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయినా ప్రభుత్వం ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించకపోవడం శోచనీయమని రైతు సంఘం డివిజన్ నాయకుడు వజ్జె శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో నష్టపరిహారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేదన్నారు. మండల వ్యాప్తంగా రైతులకు సుమారు రూ.2కోట్లకు పైగా నష్టపరిహారం చెల్లించాల్సి ఉందని, ఈ ప్రభుత్వమైనా స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు.